
# మనిషి

## తెలకపల్లి రవి

కథ



**ఆ**ఫీసులో అడుగు పెట్టేసరికి నా టేబుల్ దగ్గర అతను కనిపించాడు.

నేరుగా సీటు దగ్గరకు వెళ్లకుండా ఏదో విషయమై కొంచెం ఆగాల్సి వచ్చింది. ఆ విధంగా అతన్ని పరిశీలించే అవకాశం కలిగింది.

ఆ విషయం తెలుసుకున్నాక సీటు కేసి నడిచాను.

"మిమ్మల్ని చాలాసేపు కూచోబెట్టినట్టున్నానే?" అంటూ సంభాషణ ప్రారంభించాను.

"లేద్సార్! నేనే ఆఫీసులోకి రాగానే డిస్టర్బెన్స్ అవుతానేమోనని ఆలోచిస్తూ కూచున్నాను" అన్నాడతను.

"భలేవారే! మిమ్మల్ని కలుసుకోవడం సంతోషమే. కాకపోతే వేరే పని పెట్టుకున్నాను. మీరు వస్తున్నట్లు తెలిస్తే ఖాళీగా వుండేవాణ్ని" అన్నాను నొచ్చుకుంటున్నట్టుగా. చివరలో మెల్లగా అన్నాను "ఫోన్ చేస్తే..."

ఇలాటి సంభాషణలు ఎలా దారి తీస్తాయో నాకు బాగా తెలుసు. అందుకే దాన్ని అర్ధాంతరంగానే ఆపేశాను. సమాధానం కూడా వూహించినదానికి భిన్నంగా లేదు.

"ఫోన్ చేయడం కుదరలేదు. మా వాళ్ల ఇంట్లో దిగాను, వాళ్లకంతా హడావుడి. మనం వచ్చి వాళ్లను ఇబ్బంది పెట్టడం బావుండదు కదా..."

అంత సున్నితంగా ఆలోచించే సంస్కారానికి ఎవరైనా జోహార్లర్పించకుండా వుండటం ఎలా సాధ్యం?"

మరి ఆ మాట నాకు వర్తించదా? అని అడగడానికి లేదు. అడగాలనే లేదు ముందు. ఇవన్నీ అలవాటై పోయాయి.

"ఫర్వాలేదు లెండి. మీరు ఎప్పుడో ఒకసారి వచ్చేవాళ్లు. పనులు ఎప్పుడూ వుండేవే. ఇంతకూ వూరికేనా? ఏమైనా పని మీద వచ్చారా?"

"అబ్బే ఏముంటుందండీ?" మీకెన్నో పనులుంటాయి. స్వంత పనులకోసం మీలాటి వాళ్లను ఇబ్బంది పెట్టకూడదు కదా..."

"ఇబ్బందేముంది! ఇటీజ్ ప్లెజర్..." అలవాటైన మాటలు అప్రయత్నంగా దొర్లిపోతుంటాయి.

"ఇంతకూ విషయం చెప్పారు కాదు"

"మావాడికి ఒకడికి ఇంటర్వ్యూ వచ్చిందండీ. వారు మీకు బాగా తెలుసన్నారు. మీరొక మాట చెబితే..."

"క్వాలిఫికేషన్స్ ఉన్నాయా?"

"వెల్ క్వాలిఫైడ్ సార్. వచ్చిన వాళ్లలో తనదే హైయ్యెస్ట్ క్వాలిఫికేషనట"

"మరి ఇంకేం. ఎలాగూ వస్తుంది కదా! మధ్యలో రెకమెండేషన్ అవసరమంటారా?" నవ్వుతూ అన్నాను.

"రికమెండేషనని కాదు సార్! మీరొక మాట చెబితే బావుంటుందని" అతని మాట పూర్తి కాలేదు.

"సరే! మీరు పాత ఫ్రెండు కదా! తప్పక ట్రై చేస్తాను. నా ప్రయత్నం నేను చేస్తాను"

ఇలా అంటుండగానే పక్కనున్న మిత్రుడు నావైపు అదోలా చూశాడు. తనలా ఎందుకు చూస్తాడో నాకు తెలుసు.

నేనేదైనా అనే లోపలే-

"సార్ చెప్తాడు లెండి. మీకేం ఫర్వాలేదు వెళ్లిరండి" అన్నాడు శంకరం.

"అదే సార్! నా నమ్మకం కూడా అన్నాడు" అతను.

"నిజమేనండీ! చెబుతానంటున్నా కదా! చెప్పినా కావాలి కదా! నేనెప్పుడూ ఇలాటి విషయాల్లో నిక్కచ్చిగా వుండాలనుకుంటాను. మా వాడికి నచ్చనిది కూడా అదే."

"చేసేది చేస్తూ నీరసంగా మాట్లాడతావెందుకు? రేపు నీవల్ల వచ్చినా ఫలితం దక్కదు" అంటుంటాడు.

"ఇవన్నీ ఫలితం కోసం చేస్తామా ఏమిటి? అయినా ఎవరు పట్టించుకుంటారివన్నీ" అని అంటుంటాను. ఇది మామధ్య మామూలే.

కాకపోతే ఈ మాటలతో ఎదుటివాళ్లు అదోలా అవుతుంటారు. దేన్ని ఎంతవరకు తీసుకోవాలా అని చిక్కులో పడిపోతుంటారు.

ఇవన్నీ నేను అస్సలు పట్టించుకోను.

ఈరోజు కూడా ఎదురుగా వున్నతను అలాగే చిక్కులో పడినట్లు మొహం పెట్టాడు.

సరే లెండి. నేను మాట్లాడతాను మరోసారి హామీ ఇచ్చాను.

అతను అటూ ఇటూ కాకుండా మొహం పెట్టి వెళ్లిపోయాడు.

** ** **

ఏమిటీ? ఉదయమే లేచి ఫోను పట్టుక్కూచున్నారు? మా ఆవిడ విసుక్కొంది ఎప్పట్లాగే.

"అది కాదురా! మళ్లీ లేటైతే ఆయన వెళ్లిపోతాడు".

"ఔను మరి. ఎవరి పనుల మీద వాళ్లు వెళ్లిపోతారు కానీ మనలాగా తెల్లారింది మొదలు తీరిగ్గా కూచుంటారా?"

నేనేమి అనకుండా ఫోన్ కొనసాగించాను.

అదృష్టవశాత్తూ కావలసిన ఆయన దొరికాడు.

నమస్తే...! బావున్నారా... వగైరా మర్యాదలన్నీ ముగిసిపోయాక విషయం చెప్పాను. ఫలానా పనిలో సహాయం చేయాలి అని.

ఆయనా ఒక పట్టాన చిక్కలేదు. అది తనకు సంబంధించింది కాదన్నట్టు కాస్సేపు మాట్లాడాడు. మళ్లీ తన చేతిలో వున్నట్లు మాట్లాడాడు. నేను ఫోన్ చేయడం చాలా సంతోషకరమని, దాన్ని బట్టి అవతలి మనిషి ఎంత ముఖ్యుడో తెలుస్తుందని అన్నాడు. ఇంతకూ అతను చేస్తాడో లేదో నాకు అర్థం కాలేదు. అయినా నేను చెప్పాల్సింది చెప్పి, థాంక్స్‌తో ఫోన్ ముగించాను.

వారం రోజుల తర్వాత ఫోన్ చేశాడు.

నేను అదీ ఇదీ మాట్లాడాను. కానీ అవతలి గొంతులో ఏదో అసంతృప్తి ఛాయగా. అదే పనిగా ఫోన్ చేసి, అసంతృప్తి దేని గురించై వుంటుంది?

ఆలోచిస్తూనే మాట్లాడుతున్నాను.

చివరికాయన వుండబట్టలేక చెప్పాడు.

"ఏమండీ! మీరు చెప్పిన క్యాండిడేట్ పని పూర్తి చేశాను" అని.

ఇప్పుడు ఆశ్చర్యపోవడం నా వంతైంది. ఆయనకు పని అప్పగించాను. కానీ అది ఏ స్థితిలో వుందో తెలుసుకోలేదు. పదే పదే అడిగితే వెంట పడినట్టుంటుందనే సంకోచం ఒకటి. పని జరిగితే ఎలాగూ తెలుస్తుంది అని మరోటి.

ఆయనే చెప్పవలసి రావడం కొంచెం ఇబ్బందే అనిపించింది. ఏం చేస్తాను? "థాంక్స్" చెప్పడం తప్ప.

"అతను మీకు చెప్పలేదా? నేను మిమ్మల్ని కలిసి పని అయిందని చెప్పమన్నానే" అన్నాడు ఆశ్చర్యంగా.

"లేదండీ! నేను కూడా ఈ మధ్య వూళ్లో లేను సరిగ్గా..." మళ్లీ అలవాటైన మాటలే. ఎవరిని కాపాడటానికి, అవతలివారినా లేక మన పరువునా? ఏమో!

"ఒకే అండీ వుంటాను" హమ్మయ్య. ఒక గొడవ అయిపోయింది.

కానీ లోలోపల మళ్లీ ప్రశ్నలు. అంత ఇదిగా అడిగిన మనిషి పూర్తికాగానే ఎందుకు చెప్పలేదు? ఏమో!

** ** **

తర్వాత చాన్నాళ్లకు కనిపించాడతను.

మీటింగుకు లేటైందని హడావుడిగా వెళ్తుంటే నడిరోడ్డుపై తారసపడ్డాడు.

తనే చూసి పలకరించాడు. "ఏం సార్! బావున్నారా? ఎక్కడికో హడావుడిగా వెళ్తున్నట్టున్నారు"

నాకు ఒక్క క్షణం గుర్తు రాలేదు. ఎంత వద్దనుకున్నా పోని బలహీనత. మనుషుల పేర్లు ఠక్కున జ్ఞాపకం రావు.

ఎవరో అన్నట్లు మెదడుకన్నా కళ్ళకు జ్ఞాపకం ఎక్కువట.

అంటే కళ్లకు వేరే మెదడుందా? ఏమిటో మాటలు!

ఈ తర్జనభర్జనల మధ్య పేరు ఠక్కున జ్ఞాపకం వచ్చేసింది. దాంతోపాటే ఇతర విషయాలూ...

"అన్నట్టు మీ వాడికి ఉద్యోగం వచ్చిందటగా?" వద్దనుకుంటూనే అడిగాను.

అతను అర్థం కానట్లు మొహం పెట్టాడు.

అనేకసార్లు అనుభవమైన విషయమైనా అదోలా అనిపించకుండా వుండలేకపోయాను.

"అదేనండీ! మీరు ఆ మధ్య నా దగ్గరకొచ్చి ఫలానా వారికి చెప్పమన్నారు కదా!" గుర్తు చేశాను.

"ఓహో అదా సార్" అని గుర్తు చేసుకున్నాడు. కానీ గుర్తు వచ్చినట్లు కనిపించిన తర్వాత అప్పటి ఫీలింగ్స్ లేవు.

"మా బావమరిది సార్ చేరిపోయాడు" యధాలాపంగా అంటున్నట్లు చెప్పాడు.

"అదే మీరు చెప్పారని ఆరోజే ఫోన్ చేశాను" అనివార్యంగా చెప్పాను. చెప్పాలని లేకున్నా అవతలివారి ప్రవర్తననుబట్టి అలా చేయాలనిపిస్తుంది.

ఆ మాటల వెనక ఘర్షణ, సంకోచం, ప్రభావం ఏమీ కనిపించలేదు.

ఇంతకుముందు కంటే యధాలాపంగా అన్నాడు "అబ్బే ఇది ఆయన కన్సర్న్డ్ కాదంట సార్. నాకు తర్వాత తెలిసింది. అందుకే మిమ్మల్ని ఇబ్బంది పెట్టడమెందుకని మళ్లీ రాలేదు" అలవాటైన మాటలే మళ్లీ మళ్లీ.

"ఓహో అలాగా! నేనైతే మరు రోజే చెప్పాను..."

"థాంక్స్ సార్" అందులో జీవం లేదు. శక్తి లేదు. లాంఛనం కన్నా బలహీనంగా వుంది. తప్పనిసరైన ధన్యవాదాలు చెప్పి ధన్యుణ్ని చేశారు. లోలోపల అనుకున్నాను.


"ఒకే అండీ మళ్లీ కలుద్దాం. మీటింగుకు ఇప్పటికే ఆలస్యమైంది."

నిరుత్సాహంలో ఆలస్యం ఎక్కువైనట్లు కనిపిస్తోంది మరి.

"సారీ సార్ మీకు ఆలస్యం చేశాను" మరోసారి మొదలైంది తతంగం.

"ఇట్స్ ఒకే" ఎవరికీ అక్కర్లేని ఔదార్యం!

** ** **



మీటింగు నుంచి వచ్చేప్పుడే మెట్లమీద నిలబడి ఆప్యాయంగా పలకరించాడు పెద్దాయన. నేనంటే చాలా ఇష్టం. అభిమానం ఆయనకు.

చాలాసార్లు చాలా విధాల సహాయం చేశాడు. భౌతికంగా కాకపోయినా మాటల్లో, విషయాలలో, అధ్యయనంలో, కుటుంబ మిత్రులు కూడా.

అంత సన్నిహితుడైనా సహాయపడే వ్యక్తి అయినా ఆయనను నేనే పెద్దగా కలవడం లేదు. పనులు సాకుగా వుండనే వుంటాయి. కానీ ఆయనెప్పుడూ మనసులో పెట్టుకున్నట్టు కనిపించలేదు. ఎప్పుడు పలకరించినా ప్రేమగా, నిండుగా మాట్లాడతారు.

"ఏమిటయ్యా? బొత్తిగా కనిపించడం మానేశావ్?" అనుకుంటున్నదే అన్నారు.

"ఎక్కడ సార్! రావాలనుకుంటూనే గడిచిపోతోంది..." బలహీనమైన సంజాయిషీ.

"ఆ మధ్య నీవెవరినో పంపించావట కదా! మనవాళ్లు చెప్పారు. నీవు చెప్పాక సమస్యేముంటుంది? వెంటనే చేసేశాను..." ఆయన అన్నారు.

ప్రశ్నార్థకంగా మొహం పెట్టాను.

"అప్పుడే అంత మతిమరుపైతే ఎలాగయ్యా? కుర్రాణ్ని పంపించావుకదా! ఉద్యోగం కోసం" ఆయన చెబుతుంటే విషయం నెమ్మదిగా బోధపడింది.

"డిపార్టుమెంటులో ఒకటే వేకెన్సీ వుంది. అయినా నీ మాట తీసేయలేక ఇచ్చేశాను. క్వాలిఫికేషన్ కూడా వుందనుకో. ఔను ఈ విషయం నీకు చెప్పమని చెప్పాను. మన వాడు చెప్పలేదా?" అని ఆఖరి మాటగా అడిగారు.

నా పరిస్థితి చాలా ఇరకాటంగా వుంది. దృష్టిలో లేని మలుపు. ఉన్నా లేకపోయినా ఎదురుగా వున్న పెద్దాయన నా పేరుతో చేసిన సహాయాన్ని ఇంతవరకూ తెలుసుకోలేదు కనీసం థాంక్సయినా చెప్పలేకపోయాను. ఇప్పుడు చెప్పినా లాంఛనంగా వుంటుంది. ఇందాక నాకు చెప్పినాయనలా.

ఆలోచిస్తుండగానే అల్లంత దూరంలో నేను ఫోన్ చేసిన పెద్దమనిషి కనిపించాడు.

"గురువుగారూ" అంటూ దగ్గరకొచ్చాడు. మా కాంబినేషన్ చూసి ఒకింత ఇబ్బంది పడినా అంతలోనే సర్దుకున్నాడు.

"మీరూ ఇక్కడే వున్నారా సార్?" ఆశ్చర్యం మేళవించి అడిగాడు.

"ఔనయ్యా! అవునూ ఈయనగారు చెప్పిన పని చేశానని ఇన్ఫాం చేయలేదా" అని అడిగాడాయన.

"అబ్బే అప్పుడే చెప్పేశాను సార్..." అన్నాడు క్షణమైనా తడుముకోకుండా.

అంతటితో వూరుకోక "ఏమండీ చెప్పాను కదా..." అని నా సాక్ష్యమడిగాడు.

"ఆ ఆ చెప్పారు...గా అన్నాను అర్థమనస్కంగా. ఆయన చెప్పిందేమిటో చెప్పందేమిటో బాగా గుర్తున్నా ఇక కొనసాగించలనిపించలేదు.

"సరే మళ్లీ కలుస్తాను" అని చెప్పి వచ్చేశాను. ఆ పెద్దాయనతో మాట్లాడాలని వున్నా ఆ సందర్భం సహకరించలేదు.

వస్తూ వుంటే నా కళ్లముందు ఇద్దరూ కదులుతూ కనిపించారు.

పని అప్పగించి థ్యాంక్స్ చెప్పనివాడు, పని జరగడానికి కారణం కాకపోయినా థ్యాంక్స్ చెప్పనందుకు అసంతృప్తి చెందినవాడు, వాళ్ల వచో విన్యాసాలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

అయితే కొద్ది క్షణాల్లోనే ఆ రెండు రూపాలు చెరిగిపోయి పెద్దాయన నిశ్చలంగా నిలబడ్డాడు.

"నీవు చెప్పావని చెప్పగానే చేసేశానయ్యా. ఆ సంగతి చెప్పడానికి ఫోన్ చేద్దామన్నా కుదరలేదు. ఎందుకులే అని వూరుకుండిపోయాను..."

థాంక్స్ అనుకోలేదు మనసులో. నమస్కారం పెట్టాను చేతులతో.

ఆఫీసులో నా కోసం వచ్చిన వారిని కలుసుకోవడానికి ఉద్యుక్తున్నయ్యాను. కాకపోతే మొన్నటి గందరగోళం ఇప్పుడు పోయినట్టుంది. •